పేదలకు అండగా ఉంటాం



వివాహానికి ఆర్థిక సాయం అందించిన మాజీ సర్పంచ్, ఎంపీటీసీలు

మణికొండ: పేదలకు తమ వంతు ఆర్థిక సాయం అందించి వారికి అండగా ఉంటామని నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లి మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ స్వరూప నగేష్‌యాదవ్‌లు అన్నారు. ఆదివారం వట్టినాగులపల్లి గ్రామానికి చెందిన అల్లం మల్లేష్ కూతురు వివాహానికి రూ. 71 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రజాప్రతినిధులుగా ఉన్నా లేక పోయినా పేదలకు అండగా ఉంటామన్నారు. పేదల వివాహాలు, చదువులకు తమ వంతు సాయం నిరంతరంగా అందిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు.

సందడిగా కార్తీక వనభోజనాలు



గోపూజ చేస్తున్న భక్తులు

మణికొండ: కార్తీక మాసం సదర్భంగా వివేక భారతి యోగా శాఖ ఆధ్వర్యంలో మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడ అనంత పద్మనాభస్వామి ఆలయం ఆవరణలో ఆదివారం వనభోజనాలను సందడిగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపూజ నిర్వహించి కార్తీక మాసం ప్రాముఖ్యతను వివరించారు. హనుమాన్ చాలీసా పారాయణం అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం భజనలు, కీర్తనలు, సాంస్కృతిక క్విజ్, శ్లోక పఠనం నిర్వహించారు. వక్త మలిపెద్ది శంకర్, ఎ.పవన్‌కుమార్, శ్వేతా పవన్, మోహన్‌రెడ్డి, కిరణ్, రాజు, సత్యనారాయణమూర్తి, రవి, అనిల్, సాయిబాబు, ఎ.లక్ష్మణ్‌రావు, దిపిల్ కక్కడ్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో రాణించిన అన్విక



మొదటి స్థానంలో నిలిచిన అన్విక

మణికొండ: మహారాష్ట్రలోని పూణే కేంద్రంగా జరిగిన జాతీయ కరాటే చాంపియన్‌షిప్ పోటీలలో నార్సింగి మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన జల్లి అన్విక రాణించింది. ఆరు సంవత్సరాల విభాగం పోటీలలో పాల్గొన్న ఆమె స్వర్ణ పతకం సాధించింది. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో మొదటి స్థానంలో నిలిచి జాతీయ పోటీలకు ఎంపికైంది. ఆదివారం పూణేలో జరిగిన జాతీయ స్థాయి పోటీలో ఆమె మరో మారు తన సత్తా చాటి బంగారు పథకాన్ని సాధించిందని ఆమె తండ్రి జల్లి రాజీవ్‌గాంధీ ముదిరాజ్ తెలిపారు.

నరేందర్‌కు గౌరవ డాక్టరేట్



శంషాబాద్: బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకుడు, శంషాబాద్ పోశెట్టిగూడెం గ్రామానికి చెందిన మంచర్ల నరేందర్‌కు ఏషియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించింది. నవంబర్ 30న జరిగే కార్యక్రమంలో దీనిని ప్రదానం చేయనున్నట్లు నరేందర్ ఓ ప్రకటనలో తెలిపారు. రాజకీయాలు, సామాజిక సేవా అంశాల్లో తనకు గౌరవ డాక్టరేట్‌ను అందజేయనుండటంతో ఆయన సంతోషం వ్యక్తం చేశారు. రాజకీయ, సామాజిక సేవా కార్యక్రమాల్లో మరింత ఉన్నతంగా పనిచేసేందుకు కృషి చేస్తానన్నారు.

ఘనంగా పోచమ్మ ఆలయ పునర్నిర్మాణ పూజలు



శంకుస్థాపనలో పాల్గొన్న భక్తులు

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడలోని శ్రీ పోచమ్మ దేవాలయంలో ఆదివారం శంకుస్థాపన పూజలు ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ దేవాలయ పునఃనిర్మాణ పూజలను వైభంగా చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఆదివారం నుంచి దేవాలయ నిర్మాణ పూజలు వేగవంతంగా ప్రారంభిస్తున్నట్లు దేవాలయ కమిటీ అధ్యక్షుడు సోమారం రాజ్‌కుమార్ తెలిపారు. అధునాతన పద్ధతిలో దేవాలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. పూజల్లో సోమారం రవీందర్, మద్దూరి బాలసుబ్రహ్మణ్యం, మద్దూరి బాలమురళీకృష్ణ, శ్రీకాంత్, సోమారం శ్రీనివాస్, గోదల భాస్కర్, గోదల చంద్రయ్య, మద్దూరి శివశంకర్, కొత్తూరు మల్లేష్, మద్దూరి గోపాల్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ జామ్



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలోని పాత ముంబాయి జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్ అయింది. ఆదివారం మధ్యాహ్నం శేరిలింగంపల్లి జీహెచ్‌ఎంసీ జోనల్ కార్యాలయం సమీపంలో యూటర్న్ వద్ద జీహెచ్‌ఎంసీ స్వీపింగ్ వాహనం నిలిచిపోవడంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు ఒక్కసారిగా స్తంభించిపోయాయి. సెలవు దినం వాహనాల రద్దీ తక్కువగా ఉండటంతో వల్ల త్వరగానే క్లియర్ అయింది. అనంతరం జీహెచ్‌ఎంసీ స్వీపింగ్ వాహనాన్ని రోడ్డు మీద నుంచి పక్కకు నెట్టడంతో రాకపోకలకు సాఫీగా సాగాయి.

మున్సిపల్ ఆఫీస్.. బస్టాప్ ప్లీజ్..!

- సింప్లెక్స్ వద్ద లేని బస్టాప్
- మున్సిపల్ కార్యాలయానికి రవాణా వసతులు పూజ్యం
- ప్రజలకు తప్పని ఇబ్బందులు



జాతీయ రహదారి పక్కన సింప్లెక్స్ రహదారి ప్రాంతం

శంషాబాద్: పరిపాలన సౌలభ్యం కోసం ప్రారంభించిన కొత్త మున్సిపల్ కార్యాలయానికి రవాణా సౌకర్యం అగమ్య గోచరంగా తయారైంది. పట్టణంలో సింప్లెక్స్ రహదారి నుంచి రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న మున్సిపల్ కార్యాలయానికి రాకపోకలు సాగించేందుకు సాధారణ ప్రజలతో పాటు సిబ్బంది సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

దూరం.. దూరం...

- పురపాలక సంఘ కార్యాలయాన్ని పట్టణానికి దూరంగా సింప్లెక్స్ సమీపంలో జాతీయ రహదారికి రెండు కిలోమీటర్ల దూరంలో నిర్మించారు. అట్టహాసంగా ఆ ప్రారంభించారు. నెల రోజులుగా ఇక్కడి నుంచే పూర్తి స్థాయి కార్యకలాపాలు జరుగుతున్నాయి. కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు ఆటోలను మాత్రమే ఆశ్రయించాల్సి వస్తోంది.
- అటుగా షేర్ ఆటోలు కూడా రాకపోకలు లేకపోవడంతో రూ. 150 నుంచి రూ. 250 వరకు చెల్లించాల్సి వస్తోంది. తిరిగి వెళ్లే సమయంలో కూడా ఆటోలు సైతం దొరక్క నానా ఇబ్బందులు పడుతున్నారు.

సింప్లెక్ వద్ద బస్టాప్ ఏర్పాటుకు వినతి...

- శంషాబాద్ నుంచి నగరం వైపు ప్రయాణించే బస్సులను సింప్లెక్స్ వద్ద బస్టాప్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. మున్సిపల్ కార్యాలయానికి వెళ్లే ఉద్యోగులతోపాటు ప్రజలకు కొంత మేరకు సౌలభ్యంగా మారుతుందని పేర్కొంటున్నారు.
- సంబంధిత ఉన్నతాధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించి మున్సిపల్ కార్యాలయానికి రవాణా సౌకర్యాన్ని కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



సింప్లెక్స్ రహదారిలో కొత్త మున్సిపల్ కార్యాలయం

‘మాలల సింహ గర్జన’ను విజయవంతం చేయాలి

వర్గీకరణ వ్యతిరేక కమిటీ చైర్మన్ మన్నె శ్రీధర్

రాజేంద్రనగర్: వర్గీకరణ పేరిట మాలలకు జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ డిసెంబర్ 1వ తేదీన నిర్వహించనున్న మాలల సింహ గర్జన సభను మాల సోదరసోదరిమణులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని వర్గీకరణ వ్యతిరేక కమిటీ చైర్మన్ మన్నె శ్రీధర్ కోరారు. ఆదివారం రాజేంద్రనగర్‌లోని లైబ్రరీ వద్ద నిర్వహించిన రాజేంద్రనగర్ నియోజకవర్గ మాల ముఖ్య నేతల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మన్నె శ్రీధర్ మాట్లాడుతూ... డిసెంబర్ 1వ (ఆదివారం) తేదీ మధ్యాహ్నం 12 గంటలకు సికింద్రాబాద్ జింఖానా మైదానంలో సభ జరుగుతుందన్నారు. దళితుల మధ్య చిచ్చుపెట్టేలా చేసిన వర్గీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రంలోని మాల సంఘాలన్నీ కలిసి సింహగర్జన బహిరంగ సభను నిర్వహింప తలపెట్టామన్నారు. సభను విజయవంతం చేసేందుకు మాల కులస్తులు, స్థానిక పంచాయతీ, కమిటీ పెద్దలు, ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు, అంబేడ్కర్ యువసేన సభ్యులంతా కలిసి ప్రతి మాలను కలిసి సమస్యను వివరిస్తూ కరపత్రాలను అందించి సభకు వచ్చేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర కన్వీనర్ బలవంత రావు, నేతలు పచ్చ శ్రీనివాసులు, వీరన్న, గొడుగు సంజీవ, పచ్చ నర్సింగ్ రావు, పంబల రాజు, పచ్చ అనిత, వేము వందనం, పత్యారా రాజు, దాసరి రమేశ్, శ్రీశైలం, ఎస్.మద్దెల శంకర్, పెంటయ్య, పెండ్యాల శ్రీకాంత్, గొడుగు నర్సింగ్ రావు, పాలమాకుల రాజు, మురళీ, గణేష్, నర్సింగ్ రావు, పెండ్యాల రవీందర్, కార్తీక్ మోహన్, మురళీ, అశోక్, మల్కారం రాములు, వేణు శ్రీరాములు, కృష్ణ, రమేశ్, వెంకటేశ్, పచ్చ భాస్కర్, పత్యారా నరసింహా, బి.భరత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ‘ఎస్కీ’లో హెల్త్ టాక్

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా క్యాంపస్‌లోని సెంటినరీ కన్వెన్షన్ సెంటర్ ఆడిటోరియంలో ప్రత్యేక హెల్త్ టాక్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు తెలిపారు. సోమవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 వరకు కొనసాగే కార్యక్రమంలో ప్రముఖ ఆరోగ్యనిపుణుడు, హోమియో వైద్యుడు, డాక్టర్ ఖాదర్‌వలీ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారన్నారు. ప్రస్తుతం మిల్లెట్స్ వినియోగం, ఆవశ్యకత, వాటి ఉపయోగాలు, సంపూర్ణ ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరిస్తారన్నారు.

ఆర్యసమాజ్‌లో ప్రత్యేక పూజలు



గోల్కొండ: కార్వాన్ కుల్సుంపురాలోని శ్రీ విశ్వాంజనేయ భక్త సమాజం టెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్తీక మాసం మహోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. శ్రీ సపరివార ద్వదశ జ్యోతిర్లింగ దేవాస్థానం కార్వాన్ యువజన సంఘం ఆధ్వర్యంలో కుశలవపురంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రత్యేక అభిషేకం తదితర పూజలు జరిగాయి. ట్రస్ట్ బోర్డు ప్రధాన కార్యదర్శి గురజాల అశోక్‌గౌడ్ ఆలయానికి విశిష్ట సేవలు అందించిన వారికి ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో దేవర రాజేశ్వర్, ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ ఠకూర్ జగత్‌సింగ్, కాంగ్రెస్ నాయకుడు కురాకుల కృష్ణ తదితరులున్నారు.

ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ భేష్



వైద్య శిబిరాన్ని కౌన్సిలర్‌తో కలిసి ప్రారంభిస్తున్న వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

మణికొండ: సేవా సంస్థలు, కార్పొరేట్ ఆస్పత్రులు, వివిధ అసోసియేషన్‌లు కాలనీలు, బస్తీల్లో ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయమని వీటితో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు, హుడా కాలనీలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్‌కే క్లినిక్స్ వారు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన కౌన్సిలర్ ఎల్.వందన నగేష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రస్తుత పరిస్థితిలో ప్రతి ఒక్కరూ ఆరు నెలలకు ఒకసారి అన్ని రకాల ఆరోగ్య పరీక్షలను నిర్వహించుకోవాల్సిన అవసరం ఏర్పడుతుందన్నారు. ఇలాంటి శిబిరాలలో ఉచితంగా పరీక్షలు చేయించుకుని డాక్టర్‌ల సలహాలను పాటించాలన్నారు. శిబిరంలో రక్త పరీక్షలు, ఈసీజీ, ఎముకలు, దంత, గుండె పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులు, సలహాలను అందజేశారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, సర్దార్ పటేల్ పార్క్ వాక్ మేట్స్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

కుటుంబ సర్వే విజయవంతం చేస్తాం

గోల్కొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుటుంబ సర్వేను విజయవంతం చేస్తామని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కురాకుల కృష్ణ అన్నారు. ఆదివారం కార్వాన్ డివిజన్‌లోని గిర్కపల్లి, బంజావాడి తదితర ప్రాంతాల్లో సమగ్ర కుటుంబ సర్వే జరిగింది. అధికారి మహ్మద్ రియాజుద్దీన్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి కుటుంబ వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా రియాజుద్దీన్ మాట్లాడుతూ.. కుటుంబ సర్వేకు ఇప్పటి వరకు తాను తిరిగిన ప్రాంతాల్లో ప్రజలు సహకరించి తమ వివరాలను నమోదు చేసుకున్నారన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడండి



కబ్జా చేసిన ప్రభుత్వ స్థలం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ ఎర్రబోడా పోచమ్మ దేవాలయం వెనుక ప్రాంతంలోని సర్వే నంబర్–7లో ఉన్న ప్రభుత్వ స్థలం కబ్జా కాకుండా కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. దాదాపు 400 గజాల ఈ ఖాళీ స్థలంలో గతంలో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలమని బోర్డు ఏర్పాటు చేశారని వారు తెలిపారు. అయితే కొందరు శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు కబ్జా చేస్తూ పనులను చేపట్టారని ఆరోపించారు. సెలవు దినం కావడంతో కబ్జాకు పాల్పడుతున్నారని ఈ విషయంలో రాజేంద్రనగర్ రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి చేపట్టిన నిర్మాణాన్ని కూల్చివేయాలని కోరారు. గతంలో తహసీల్దార్‌తో పాటు రాజేంద్రనగర్ ఎమ్మెల్యేను కలిసి ఫిర్యాదు చేయగా బోర్డును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ స్థలం అనే బోర్డు ఉన్నా కొందరు దర్జాగా కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. సోమవారం ఎర్రబోడావాసులు అందరూ కలిసి ఎమ్మెల్యేతో పాటు తహసీల్దార్‌ను కలిసి మరోసారి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

గోల్కొండ: యోగాసనాలతో సంపూర్ణ ఆరోగ్యంతో ఉండవచ్చునని మెహిదీపట్నం సంతోష్‌నగర్ పార్కు యోగా సెంటర ప్రతినిధి ఈశ్వర్‌జోషి అన్నారు. ఆదివారం ఉదయం సంతోష్‌నగర్ పార్కులో మార్నింగ్ వాక్ అనంతరం యోగాసనాల కార్యక్రమం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యోగాకు అన్ని దేశాల్లో అత్యంత ప్రచుర్యం ఉందని అన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ ఆసనాలు వేయవచ్చునని ఆయన అన్నారు.



ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

గన్‌ఫౌండ్రీ: ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని టీపీసీసీ కార్యదర్శి మణిలాల్ షా పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్యాత్మిక భావాలు పెంపొందించేందుకు ప్రజల కోసం పలు కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ఆదివారం మహాదేవ్ ఆలయంలో జరిగిన కార్తీక మాసం అంకుట్ పూజల్లో పాల్గొన్నా ఆయన ప్రసంగించారు. అన్ని పండుగలను ప్రభుత్వమే స్వయంగా చేస్తుందన్నారు. ఈ వేడుకల్లో గోవింద్ అగర్వాల్, కైలాష్ కేడియా, శశి మహారాజ్, సునిత గుప్తా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప స్వామి పడిపూజ



పడిపూజలో పాల్గొన్న భక్తులు

మణికొండ: స్వామియే శరణం అయ్యప్ప.. అంటూ మణికొండ శివాలయం ప్రాంగణం మారుమోగింది. మణికొండ అయ్యప్ప స్వామి సన్నిధానం స్వాములు ఆదివారం మహా పడిపూజను గురుస్వామి మున్నునాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమైన మహా పడిపూజ మధ్యాహ్నం వరకు కొనసాగింది. జడల రమేష్ భజన బృందం భక్తి పాటలతో భక్తులు పారవశ్యం చెందారు. 18వ పడి గురుస్వామి కె. భాస్కర్‌రెడ్డి భక్తులకు అన్నదానం (భిక్ష) ఏర్పాటు చేశారు. మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, కౌన్సిలర్‌లు కె.రామకృష్ణారెడ్డి, ఎల్.వందన నగేష్, బి.కావ్యశ్రీరాములు, పి.శైలజలతో పాటు గురుస్వాములు సి.రాజేందర్‌గౌడ్, జయసింహారెడ్డి, వి.అరవింద్, కె. సురేందర్‌రెడ్డి, ఎం.రాఘవరెడ్డి, బి.శివకుమార్, కె.ప్రభాకర్‌రెడ్డి, బి.శ్రీరాములు, ఎస్. అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌కు సన్మానం

మణికొండ: నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన వి.బాల్‌రెడ్డిని మణికొండ రెడ్డి సంఘం నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. పంచవటి కాలనీలో జరిగిన కార్యక్రమంలో రెడ్డి సంఘం అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ... రెడ్డిలు అన్ని రంగాలలో అవకాశాలను అందిపుచ్చుకుని రాణించాలన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నియమించిన నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా తమ సంఘానికి చెందిన సభ్యుడు ఉండటం ఆనందాన్ని ఇచ్చిందన్నారు. ఆయన రాబోయే రోజుల్లోనూ మరింత ఉన్నత పదవులను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. నాయకులు శ్రీపతిరెడ్డి, రామసుబ్బారెడ్డి, శరత్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రమణారెడ్డి, వెంకట రమణారెడ్డి, కిషన్‌రెడ్డి, కృపాకర్‌రెడ్డి, ఉత్తం కుమార్‌రెడ్డి, లవన్‌కుమార్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, సైదిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, నరసింహారెడ్డి, నారాయణరెడ్డి, రాంవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాల్‌రెడ్డిని సన్మానిస్తున్న రెడ్డి సంఘం నాయకులు

‘కాంగ్రెస్ పార్టీని ఎవరూ వీడలేదు

కాంగ్రెస్ పార్టీ మణికొండ అధ్యక్షుడు జితేందర్



జితేందర్

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ పార్టీ పటిష్టంగా ఉందని, పార్టీ నుంచి బీఆర్‌ఎస్‌లోకి ఎవరూ వెళ్లలేదని కాంగ్రెస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎం.జితేందర్ వెల్లడించారు. ఇందుకు సంబంధించి ఆదివారం ఆయన ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. అందులో మణికొండ మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులను అడ్డుకున్న ఘనత గత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదని, నెక్నాంపూర్ చెరువు అభివృద్ధి పనులను అర్ధాంతరంగా నిలిపివేశారన్నారు. మున్సిపాలిటీకి రావాల్సిన టీడీ, ఐఆర్‌ఎస్, రాష్ట్ర ప్రభుత్వ నిధులను నిలిపి అభివృద్ధిని అడ్డుకున్నారన్నారు. కేవలం స్థానిక ప్రజలు చెల్లించిన పన్నులతోనే మున్సిపాలిటీ అన్ని రంగాలలో అభివృద్ధి సాధించిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను అడ్డుకునేందుకు బీఆర్‌ఎస్ పార్టీ కుటిల ప్రయత్నాలు చేస్తున్నదని ఆయన ఆరోపించారు. ప్రతిపక్షాలను ప్రజలు నిలదీసే రోజులు రాకుండా ఆ పార్టీ నాయకులు చూసుకోవాలని హితవు పలికారు.

ప్రశాంతంగా గ్రూప్-3 పరీక్ష



శివరాంపల్లి పరీక్షా కేంద్రం వద్ద బందోబస్తున్న నిర్వహిస్తున్న పోలీసులు

అత్తాపూర్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్–3 మొదటి రోజు ఆదివారం నిర్వహించిన పరీక్ష సజావుగా జరిగింది. రాజేంద్రనగర్ సర్కిల్ శివరాంపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన గ్రూప–3 పరీక్షల్లో 384 మంది అభ్యర్థులకు గాను 122 మంది మాత్రమే హాజరయ్యారు. 262 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మొదటి పేపర్, 2వ పేపర్ 3 నుంచి సాయంత్రం ఐదున్నరన గంటల వరకు జరిగింది. సోమవారం 3వ పేపర్ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉంటుందని అబ్జర్వర్ కిషన్‌నాయక్ సంబంధిత అధికారులు కృష్ణానాయక్, స్వర్ణ పర్యవేణలో గ్రూప్–3 పరీక్షలు సజావుగా జరిగింది. పరీక్షలు ఎలాంటి మాల్ ప్రాక్టీస్ జరగకుండా ఉండేందుకు అత్తాపూర్ పోలీసులు ఎస్ఐ నయాముద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

వేడుకగా నల్ల పోచమ్మ ఆలయ నిర్మాణ పూజలు



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

బండ్లగూడ: దేవాలయాల్లో మానసిక ప్రశాంతత లభిస్తుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 18వ డివిజన్ ఇందిరమ్మ కాలనీలో నల్ల పోచమ్మ దేవాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేవాలయాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్పొరేటర్ గోకరి శ్రీలత సురేష్‌గౌడ్, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

రోడ్డుపై చిరు వ్యాపారాలు

- వీకెండ్‌తో పాతబస్తీలో సందర్శకుల రద్దీ
- తప్పని ట్రాఫిక్ తిప్పలు
- రోడ్లను ఆక్రమిస్తూ వ్యాపారాలు
- ఫుట్‌పాత్‌లు కనిపించకపోవడంతో నడిరోడ్డుపై నడక..

చార్మినార్: పాతబస్తీలోని పర్యాటక ప్రాంతాలన్నీ ఆదివారం రద్దీగా కనిపించాయి. మదీనా–చార్మినార్ ప్రధాన రోడ్డులో ఫుట్‌పాత్‌లే కాదు..రోడ్లు సైతం చిరు వ్యాపారస్తులు ఆక్రమించుకొని నడిరోడ్డుపై వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. నయాపూల్ బ్రిడ్జితో పాటు చార్మినార్ వరకు అసలు ఫుట్‌పాత్‌లే కనిపించవు. ఎవరైనా కాలినడకన చార్మినార్ చేరుకోవాలంటే.. నడిరోడ్డుపై నుంచే తమ నడక కొనసాగించాల్సి ఉంటుంది. ఇలా ఇంకెన్నాళ్లు అని స్థానికులతో పాటు పర్యాటకులు సూటిగా ప్రశ్నిస్తున్నారు. రెగ్యులర్‌గా వ్యాపారాలు చేసే వారిని గుర్తించి వారికి గుర్తింపు కార్డులు పంపిణీ చేసి ఒక ప్లేస్‌ను కేటాయించి క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఉందని పాతబస్తీ ప్రజలు కోరుతున్నారు.



గుల్జార్‌హౌజ్-మచిలీకమాన్ రోడ్డులో..

అన్నీ నడిరోడ్డు పైనే..

పాతబస్తీలో అన్నీ రోడ్లపైనే దర్శనం ఇస్తాయి. పండ్లు, గాజులు, దుస్తులు, నిత్యావసర సామగ్రి.. ఇలా ఒక్కటేమిటి వాహనాల పార్కింగ్ కూడా నడిరోడ్డు పైనే.. పర్యాటకపరంగా, వ్యాపారపరంగా, నివాసపరంగా పాత నగరానికి జనం తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఇక ఆదివారం చార్మినార్ వైపు వెళ్లే రోడ్డులో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంటుండడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. పూర్తి స్థాయిలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. కాలినడకకు కూడా వీలు కాని పరిస్థితులు ఎదురయ్యాయి.

వీకెండ్‌తో సందడే..సందడి

సాధారణ రోజుల కన్నా..వీకెండ్ అయిన ఆదివారం సందర్శకుల సందడి ఎక్కువైంది. ముఖ్యంగా చార్మినార్ పరిసరాలు సందర్శకులతో రద్దీగా మారాయి. కాలు తీసి కాలు పెట్టలేని దుర్బర పరిస్థితులు ఇక్కడ కనిపించాయి. దీంతో ట్రాఫిక్ సమస్యలు కూడా ఎక్కువయ్యాయి. ఎటువైపు నుంచి వెళ్తే తమ గమ్యస్థానాలకు చేరుకుంటాం ..అనే మీమాంసలో వాహనదారులుండిపోయారు. అఫ్జల్‌గంజ్ దాటి నయాపూల్ మీదుగా మదీనా ద్వారా చార్మినార్ వైపు ముందుకురావడం.. మళ్లీ తిరుగు ప్రయాణంలో అఫ్జల్‌గంజ్ వైపు వెళ్లడం..వాహనదారులకు నరకం కనిపించింది. వాహనాల రాకపోకలు సత్తను తలపించాయి. వాహనదారులకు గుల్జార్‌హౌజ్ వరకు ఆదివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ట్రాఫిక్ జాం తిప్పలు తప్ప లేదు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు చార్మినార్ పరిసరాలలో సందర్శకుల రద్దీ విపరీతంగా కనిపించింది.